క్లుప్తంగా

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో విశేషంగా ముస్తాబు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వెంకటాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి పల్లవి

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురం సచివాలయ పరిధిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద వైద్యసేవలు అందించారు. వైద్యాధికారి పల్లవి మాట్లాడు తూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు.

నేడు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగలో అరుణగిరిపై కొలువైన శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏకకాలంలో శివుడు, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించనున్నట్లు వెల్లడించారు. శనిత్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు.

రాగి సాగుపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండలంలోని పెద్దకాల్వ ఆర్‌బీకేలో శుక్రవారం రైతులకు రాగి పంట సాగుపై అవగాహన కల్పించారు. జిల్లా రైతు శిక్షణ విభాగం ఏఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రాగి పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. పండించిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. అనంతరం రాయితీపై రాగి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ వందన, సర్పంచ్ ఏకాంబరం, ఎంపీటీసీ సభ్యుడు దూర్వాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై సమీక్ష

పాలసముద్రం: మండలం పరిషత్ కార్యాలయంలో జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ శుక్రవారం సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి దృష్టికి వచ్చిన ఇళ్ల మంజూరు, జగనన్న లేఅవుట్‌లలో సమస్యల పరిష్కారిని కృషి చేయాలన్నారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 32వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న జి.మోహన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల 32వ డివిజన్‌ను కమిషనర్ తనిఖీ చేయగా, యూజర్ చార్జీలు వసూలు చేసిన మోహన్‌కుమార్, ఈ మొత్తాన్ని కార్పొరేషన్ ఖజానాలో జమ చేయలేదని గుర్తించారు. ప్రజల నుంచి వసూలు చేసిన రూ.1.92 లక్షల యూజర్ చార్జీలను వారం రోజుల్లో కార్పొరేషన్ ఖజానాలో జమచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పర్యవేక్షణలో లోపం ఉండటంతో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వరసిద్ధుని సేవలో సాయిధరమ్ తేజ్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధివినాయక స్వామిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి మాలిక్, తెలుగు సినీ హీరో సాయిధరమ్ తేజ్ స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, సురేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.



సినీహీరో సాయిధరమ్‌తేజ్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

పవన్ సినిమాలను నిషేధించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వలంటీర్లు
- పుత్తూరు సచివాలయం వద్ద ప్లకార్డులతో నిరసన



పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ వ్యవస్థలను దేశ విద్రోహ శక్తులుగా చిత్రీకరిస్తున్న పవన్ సినిమాలను ప్రభుత్వం ఏపీలో నిషేధించాలని డిమాండ్ చేశారు. పుత్తూరు పట్టణ పరిధిలోని సత్యనారాయణ సచివాలయం వద్ద శుక్రవారం పవన్ వ్యాఖ్యలపై సిబ్బంది, వలంటీర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ అవసరం లేదంటూ చెప్పడానికి పవన్ కల్యాణ్ ఎవరు, అతనికి ఉన్న అర్హత ఏమిటి? ఏ ఆధారాలతో మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి గూడెం, తణుకులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పవన్ వలంటీర్ వ్యవస్థ అవసరం లేదంటూ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వార్డు, గ్రామ వలంటీర్లపై దాడి కేవలం రాజకీయ దురద్దేశంతోనే చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏమాత్రం ఇంకితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్న ప్యాకేజీ స్టార్‌ను మానసిక వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని డిమాండ్ చేశారు. తక్షణం పవన్ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు.

పవన్ సినిమాను అడ్డుకుంటాం!



ఎలాంటి ఆధారాలను చూపకుండా వలంటీర్లపై ఆరోపణలు చేస్తున్న పనవన్‌కల్యాణ్ నటించిన బ్రో సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటాం. అతని అన్ని సినిమాలను ప్రభుత్వం బ్యాన్ చేయాలి. కేవలం చంద్రబాబు ప్యాకేజీల కోసం ఇలా దిగజారి రాజకీయం చేయడం పవన్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం. వలంటీర్ల వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించింది. కేంద్రంలోని బీజేపీతో పొత్తు పెట్టుకొన్న పవన్ బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదు? ప్రభుత్వ వ్యవస్థపై ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతున్న పవన్‌ను రాష్ట్రం నుంచి వెలి వేయాలి.

–చాంద్ బాషా, జిల్లా అధ్యక్షుడు, సచివాలయ ఉద్యోగుల సంఘం, తిరుపతి

వలంటీరే నా ప్రాణదాత



నేను పోలియోతో బాధపడుతున్నాను. 2022 జనవరిలో నాకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. విషయం తెలిసి నేను భయంతో వణికిపోయాను. ఆ సమయంలో నాకు ధైర్యం చెప్పి తిరుపతి రుయా ఆస్పత్రిలో చేర్పించి, సకాలంలో వైద్యం అందేలా చేసిన నా ప్రాణదాత వలటీర్ ఇందుప్రియ అక్క. ఆమె లేకపోతే నేను లేను. ఈరోజు ఇలా మీతో మాట్లాడుతున్నానంటే అంతా వలంటీర్ అక్క చలవే. ఆసుపత్రిలో చేర్పించడమే కాదు, నాకు పింఛన్ సైతం తిరుపతి ఆస్పత్రికి వచ్చి అందించింది. ఆమె మేలు జీవితంలో మరిచిపోలేను.

–ఎస్.వి.మీనాక్షి, కొత్తవీధి, పుత్తూరు,

పవన్‌ను రాష్ట్రం నుంచి వెలేయాలి



వలంటీర్లను దేశద్రోహులుగా చిత్రీకరించిన పవన్‌ను రాష్ట్రం నుంచి వెలివేయాలి. ఈయన చౌకబారు మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. మమ్మల్ని కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్న ప్రజల నుంచి దూరం చేయాలన్న రాజకీయ కుట్ర తప్ప మరొకటి కాదు. ప్యాకేజీలు తీసుకొని, రాసిచ్చిన స్క్రిప్టులను చదువుతున్న పవన్ దిగజారి మాట్లాడుతున్నారు. మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్ మహిళల భద్రత గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. పవన్ ఇక ఎప్పటికీ ఎమ్మెల్యేగా గెలవలేరని ఆయనకు అర్థమై ఇలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు.

–అంజేరయ్య, వలంటీర్, తడుకు, పుత్తూరు మండలం

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: మండల, మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గుండ్రాజుకుప్పం దళితవాడ-1లో అంగన్‌వాడీ కార్యకర్త – (ఎస్సీ-1), మున్సిపల్ పరిధి కరకంఠాపురం దళితవాడలో అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ-1), టీఆర్ కండ్రిగలో సహాయకురాలు (బీసీ-బీ -1) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారుఉ. పదవ తరగతి పాసై, ఈ నెల 1వ తేదీ నాటికి 21 –35 ఏళ్ల వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలైతే 18 ఏళ్లు నిండిన వారు కూడా అర్హులన్నారు. అభ్యర్థులు వివాహితులై స్థానికంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇదివరకే అంగన్‌వాడీ సహాయకురాలుగా పనిచేస్తూ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు మహిళా శిశు సంక్షేమ శాఖ జీవో నెం-102 మేరకు వయసు 45 ఏళ్లకు మించి ఉండరాదని చెప్పారు. ఈ నెల 17 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను నగరి ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలన్నారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం, నివాసం, పుట్టిన తేదీ, వైకల్యానికి సంబంధించిన సర్టిఫికెట్లు గెజిటెడ్ అధికారిచే ధృవీకరణ చేసి జతపరచాలన్నారు.

నింద్ర: నింద్ర మండల పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానించనున్నట్లు సీడీపీవో కే కృష్ణవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలకాటూరు హెచ్‌డబ్ల్యూ అంగన్‌వాడీ కార్యకర్త (ఎస్సీ), కీళాంబకం హెచ్‌డబ్ల్యూ (ఎస్సీ), శ్రీరామాపురం ఎస్టీ కాలనీ మిని కార్యకర్త (ఎస్టీ), నింద్ర గ్రామంలో సహాయకురాలు (బీసీ-బీ) పోస్టుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ లోపు నగరి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కార్వేటినగరం: వెదురుకుప్పం, కార్వేటినగరం, శ్రీరంగరాజపురం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల ఉద్యోగాలకు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కార్వేటినగరంలోని ఐసీడీఓస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వెదురుకుప్పం మండలంలోని కురివికుప్పం, జక్కదొన్న, కనికాపురం, తంగేలుమిట్ట, శ్రీరంగరాజపురం మండలంలో దాసరికండ్రిగ, పబ్బచేనుమిట్ట, కాపుకండ్రిగ, కార్వేటినగరం మండలంలో రౌతువానిగుంట, జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులు ఉన్నట్లు వివరించారు.

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): జీడీ నెల్లూరు ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ వినతశ్రీ కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జీడీ నెల్లూరు మండలంలో ఆత్మకూరు, ఎదరపాళ్యెం (రామానాయుడుపల్లె), కలిజవేడు, బాలాపురం, పీపీపురం, దళవాయిపల్లె, పెనుమూరు మండలంలో గొల్లపల్లె, పాలసముద్రం మండలంలో ఈ.వేణుగోపాలపురంలో ఖాళీలు ఉన్నట్లు వివరించారు.

ప్రజల వద్దకే ఉచిత సేవలు



సర్టిఫికెట్లు అందుకున్న వారితో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి

నగరి: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు విలువైన సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మున్సిపల్ పరిధి కొత్తపేట ఎన్టీఆర్ నగర్ సచివాలయ పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపులో పాల్గొన్నారు. 11 రకాల సేవలకు సంబంధించి 639 మందికి సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ పథకం ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ భూపాలన్, కో-ఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, హమీద్, నాయకులు మనోహర్, ఇళంగో, మున్సిపల్ డీఈ నరేష్, హౌసింగ్ ఏఈ మెప్మా అధికారి సునీత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిర్మాణ రంగంవైపు దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అరుణ

నగరి: దేశం స్థిరాభివృద్ధి సాధించడానికి యువత నిర్మాణ రంగంవైపు దృష్టి సారించాలని అబోట్ డయాగ్నోస్టిక్స్ (యూఎస్ఏ), డైరెక్టర్ ఆఫ్ క్వాలిటీ డాక్టర్ అరుణ వి.బడిగ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగం «వైద్య పరికరాల ఉత్పత్తి నాణ్యత» అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. కోవిడ్ 19 సమయంలో తమ కంపెనీ తయారు చేసిన రక్షణ పరికరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడినట్లు చెప్పారు. ఉపాధి లభించడానికి, దేశం స్థిరాభివృద్ధి సాధించడానికి విద్యార్థులు నిర్మాణ రంగంవైపు దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, భారత దేశంలో ఉత్పత్తి రంగాన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం ఇన్‌చార్జి డా.ఇందిరా ప్రియదర్శిని, డా.నరసయ్య, ముని కుమారి, శివలక్ష్మి లాల్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరి: విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా శనివారం నగరి, నెత్తం కండ్రిగ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 132/33 కేవీ నిర్వహణ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

త్వరితగతిన 'పేదలందరికీ ఇళ్లు'



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు

వెదురుకుప్పం: పేదలందరికీ ఇళ్ల పథకం కింద మంజూరైన పక్కాగృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని దిగువగెరిగదొన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో పకడ్బందీగా మౌలిక వసతుల కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీడీఓ సుబ్రమణ్యం, టీకేఎంపురం కార్యదర్శి నాగరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనిత, ఆర్‌బీకే చైర్మన్ కేశవులు, మాజీ సర్పంచ్ జయరామ మందడి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



సాయి సౌమ్య



జశ్వంత్



మోహిత్

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లె, డీఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాయిసౌమ్య, జశ్వంత్, మోహిత్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హేమారెడ్డి, కేశవులు తెలిపారు. శుక్రవారం వారిని అభినందించారు. డీసీఈబీ కార్యదర్శి హేమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో మరింత ఉత్తమంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా సమాఖ్య సభ్యులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఏపీఎం ఫరీద్‌మస్తాన్ మాట్లాడుతూ డిఫాల్ట్ గ్రూపులను బలోపేతం చేయాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకుని, జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలని కోరారు. చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ చిరంజీవి, లోకనాథ, సంఘమిత్రలు మురగయ్య, శోభ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై నిఘా



తనిఖీ చేస్తున్న డీఈ శేషాద్రి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్తు చౌర్యంపై నిఘా ఉంచామని అందులో భాగంగా తరచూ తనిఖీలు చేస్తున్నామని ట్రాన్స్‌కో డీపీ విభాగం డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) ఎస్ఈ రమాదేవి తెలిపారు. ఆమె శుక్రవారం చిత్తూరులోని జిల్లా విద్యుత్ స్టోర్‌ను పరిశీలించారు. మెటీరియల్ క్వాలిటీ, స్టాక్ నిల్వ, వస్తువుల కొలతలను పరిశీలించారు. విద్యుత్ చౌర్యం అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనపులోడ్, చౌర్యం, బ్యాక్‌బిల్లింగ్, మాల్‌ప్రాక్టీస్, డైరెక్ట్ ట్యాపింగ్ వంటి అంశాలను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 42 మంది సభ్యులతో ఉన్న బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు చౌర్యానికి పాల్పడకుండా శాఖకు సహకరించాలని వివరించారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ జయప్రకాష్, శేషాద్రి, ఏఈలు కుమార్, వివేకానందరెడ్డి, బాలగురవయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ అడ్మిషన్లు ప్రారంభం

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ కోర్సులో అడ్మిషన్లు ప్రారంభించినటు్లో కో-ఆర్డినేటర్ నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31 ఆఖరు తేదీ అని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088ను సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛంద పన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

చిత్తూరు రూరల్: తమిళనాడు, కర్ణాటక వాహనదారులకు తాత్కాలిక అనుమతి పత్రం, స్వచ్ఛంద పన్నుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో ద్వారా మాత్రమే చేయాలని రాష్ట్ర శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి తెలిపారు. పలమనేరు, నరహరిపేట రవాణాశాఖ తనిఖీ కేంద్రాల వద్ద పన్నులు చెల్లించుకోవాలని సూచించారు. నగదు బదిలీలు చేయకూడదని ఆదేశాలు అందించినట్లు ఆయన చెప్పారు.

పండుగ వాతావరణంలో జగనన్న సురక్ష







శ్రీరంగరాజపురం: ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్వేటినగరం: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు, విజయపురం : కాళికాపురంలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు

- పేదలకు వరంలా మారిన వైనం
- అన్ని మండలాల్లో అర్హులందరికీ సర్టిఫికెట్ల మంజూరు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం వాడవాడలా పండుగ వాతావరణంలో దిగ్విజయంగా సాగుతోంది. ఈ జగనన్న సురక్ష పేదలకు ఓ వరమని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శెట్టివనత్తం సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష నిర్వహించారు.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు పొందని వారు, ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారికి వెంటనే మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ప్రజలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు ధనంజయరెడ్డి, రఘునాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, చెంగల్రాయనాయుడు, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య, సర్వేయర్ మురళి, పంచాయితీ కార్యదర్శి జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ మణి, జనార్ధన్, ప్రసాద్‌రెడ్డి, లోకనాథరెడ్డి, గురవారెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరం: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మోహన్‌మురళి, సర్పంచ్ ధనంజయవర్మ చేతులమీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీపతి, ఏఓ హేమలత, ఈఓ ఎస్.ఎస్.మణి, జేసీఎస్ మండల కన్వీనర్ పురంధర్, వైఎస్సార్‌సీపీ నేత వెంకటేష్ పాల్గొన్నారు.

సింహరాజుపురంలో..

పాలసముద్రం: మండలంలోని ఎస్‌కేఆర్‌పురం సచివాలయ పరిధి సింహరాజుపురంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్, భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, ఎంఈఓ గిరిజ, ఏఓ ఢిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, నాయకులు సుందరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): అర్హులందరికీ సంతృప్తికరంగా పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని ఎంపీపీ అనితారెడ్డి తెలిపారు. శుక్రవారం పాచిగుంట సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కింద లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్, అశోక్, కేశవరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి వెంకటేశరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

విజయపురం (నగరి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కాళికాపురం సచివాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అక్కడికక్కడే ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు అప్‌డేషన్ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. ఇంతటి సువర్ణ పాలన అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





కార్వేటినగరం: లబ్ధిదారుకు కొత్త రేషన్ కార్డు పంపిణీ చేస్తున్న అధికారులు, పాలసముద్రం: ధ్రువీకరణ పత్రం ఇస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు